
# మార్పు

- గుమ్మడి రవీంద్రనాథ్



తెలుగు సినీ దర్శక ప్రముఖులు కొందరు కలిసి ఏర్పాటుచేసిన ఓ సన్మాన సభ రవీంద్ర భారతిలో జరుగుతోంది. సన్మాన గ్రహీత పేరు దశరథ్. అతను కృష్ణా జిల్లాలోని ఓ చిన్న ఊళ్ళో ప్రభుత్వోద్యోగి. కాలేజీ రోజుల్నించీ పత్రికలు చదివే అలవాటుంది అతనికి. ఆ సాహిత్యాభిరుచి వయసుతోబాటు పెరుగుతూ వచ్చింది.

ఈమధ్య ఒక ప్రముఖ టీవీ ఛానెల్ వాళ్ళు, 'రేపటి దర్శకులు'అనే ఓ వినూత్న కార్యక్రమంలో భాగంగా లఘు చిత్రాల్ని పంపమని ప్రేక్షకులను కోరారు. దానికోసం దశరథ్ పంపిన 'పంజరం'అనే లఘు చిత్రానికి ప్రథమ బహుమతి లభించింది. జీవకారుణ్యం, మూగ జీవాలను ప్రేమించడం అన్న అంశం మీద కళాత్మకంగా తీసిన దృశ్యకావ్యంగా ప్రముఖుల మన్ననలను అందుకుంది. ఆ 'పంజరం' ఏకంగా అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌లోనే దర్శక కేతనాన్ని ఎగురవేసి దశరథ్‌ని నిలువెత్తు చూపేసరికి, చిత్రరంగ పెద్దలు కొందరు ఆ ప్రతిభను సన్మానించాలని ఆ కార్యక్రమాన్ని ఏర్పాటుచేసారా రోజు.

ఓ ప్రఖ్యాత దర్శకుడు ఉపన్యసిస్తూ, "... చాలా చిన్న చిత్రం. కానీ, జీవకారుణ్యం మీద ఇంతగా మనసుని కదిలించేది నేనింతవరకూ చూళ్ళేదు. తెలుగు దర్శకులు ఆర్ట్ ఫిల్మ్స్ తీయలేకపోతున్నారన్న న్యూనతాభావానికిదొక తిరుగులేని సమాధానం. నోరులేని జీవుల్ని హింసించకుండా కరుణతో సమాదరణ చూపాలన్న సామాజిక చైతన్యాన్ని రగిలించే ఈ 'పంజరం' గొప్ప ప్రయోగం. దశరథ్‌గారిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను." అని అనగానే సభంతా కరతాళధ్వనులతో మారుమోగిపోయింది. వేదిక మీదున్న దశరథ్, ఆనందోద్వేగాలకు గురయ్యాడు. ఆడిటోరియం ముందు వరుసల్లో కూర్చున్న అతని భార్య జమున కళ్ళు సంతోషంతో చెమర్చాయి. కానీ అంతటి ఉద్వేగ భరిత సమయంలోనూ దశరథ్‌ని నిర్ఘాంతపోయేలా చేస్తున్నది ఒకటి అక్కడ జరుగుతోందా!

అది: జమున ప్రక్కన కూర్చుని చూస్తున్న అతని పదిహేడేళ్ళ కూతురు రూప చంద్రిక మాత్రం చప్పట్లు కొ.ట్ట.డం.లే.దు!

❋ ❋ ❋

ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న రూపచంద్రిక ఒక లెక్చరర్ దగ్గర ఫిజిక్స్ ట్యూషన్‌కి వెళ్తుంటుంది. ఆరోజు ఆదివారం. ట్యూషన్ ముగిసేసరికి మధ్యాహ్నం పన్నెండున్నర అయింది. స్కూటీపెప్‌లో ఇంటికి బయల్దేరింది. ఇల్లు సమీపిస్తుండగా, రోడ్ మీద ఓ చోట కనిపించిన దృశ్యం ఆ అమ్మాయిని హఠాత్తుగా బండి ఆపేలా చేసింది. కరెంట్ తీగలకు లుంగచుట్టుకున్న గాలిపటం తాలూకు దారం కాళ్ళకు బంధనాలై చిక్కుకుని ఎగరలేకపోతూ తలక్రిందులుగా వేలాడుతోంది ఓ తెల్లపావురం! రెక్కల్ని కదుపుతూ నిస్సహాయంగా చూస్తోంది. రూపకు మనస్సు చివుక్కుమంది. కరెంటు తీగలు చాలా ఎత్తులో ఉన్నాయి స్కూటీ స్టార్ట్ చేసి ఇంటికొచ్చి, "బూజుకర్ర ఎక్కడుంది మమ్మీ?" అనడిగింది తల్లిని. ఎందుకు అని అడిగింది జమున అర్థంకాక. అప్పుడు రూప చెప్పింది, "అక్కడొక పావురం దారాల్లో చిక్కుకుని ఎగర్లేకపోతోంది మమ్మీ".

"ఎక్కడ?"

"ఎలక్ట్రిక్ వైర్ల మీద?"

"డాడీకి తెలిస్తే తిడ్తారు".

"పాపం, మమ్మీ! అలా వదిలేస్తే చచ్చిపోతుంది."

"జాగ్రత్త."

"అపర్ణని తీసుకెళ్తాను. ఇద్దరం కలిసి ఎలాగోలా దాన్ని కాపాడుతాం."

❋ ❋ ❋

అపర్ణ కాలేజ్‌లో ఆమె క్లాస్‌మేట్. అపర్ణ తల్లికి ఆ ఊళ్ళో ఒక చిన్న సూపర్ మార్కెట్ ఉంది. ప్రక్క సందులోనే వాళ్ళుంటారు. స్కూటీలో అపర్ణ వాళ్ళ ఇంటికి వెళ్ళి తనను వెనుక కూర్చోబెట్టుకుని పావురం వేలాడుతున్న చోటుకి వచ్చింది రూప. అప్పటికాపావురం, అరవడానికీ, రెక్కలల్లార్చుకోడానిక్కూడా శక్తిలేని దానిలా నిశ్చలంగా ఉండిపోయింది. బాధ, ఆకలీ, అశక్తతలతో దాని కళ్ళు మూతలు పడ్తున్నాయి. స్కూటీ స్టాండ్ వేసి దానిమీద నిల్చుని, అతికష్టంమీద దారం తాలూకు చిక్కుముడులింకా పూర్తిగా విడివడకపోవడంతో, పావురం పైకెగరలేక క్రిందపడిపోయింది. బండి మీదినుండి క్రిందికి దిగి దాని దగ్గరకు వెళ్ళి రెండు చేతుల్తో దాన్ని ఎత్తుకుని కాళ్ళకు చుట్టుకుపోయిన దారం చిక్కుల్ని విడదీసింది. ఆ చిట్టి కాళ్ళకు స్వేచ్ఛ లభించగానే ఏదో ప్రాణశక్తి పుట్టుకొచ్చినట్టు ఆ పక్షి రూప చేతుల్లోంచి తుర్రున పైకి ఎగిరిపోయి దగ్గర్లోని ఓ జామచెట్టు కొమ్మమీద వాలి కూర్చుంది. రూప కళ్ళల్లో ఆ క్షణంలో కనిపించిన ఆనందాన్ని కొలిచేందుకు ఏ బారోమీటరూ చాలదేమో. సరిగ్గా, అప్పుడు చెళ్ళున పడింది ఆమె చెంపమీద దెబ్బ! ఎదురుగా తండ్రి దశరథ్!

"ఏంటీ ఆ పని? ఆc..." "...బండెక్కి వేళ్ళమీద నిలబడి సర్కస్ పిల్లలా ఏంటా పన్లు రోడ్లమీద? బ్యాలెన్స్ తప్పి, క్రిందపడి కాలోచెయ్యో విరక్కొట్టుకుంటే..." వారపత్రిక కొనడానికి అప్పుడే ఇంటినుంచి రోడ్‌మీదికొచ్చిన ఆయన, కూతురుచేసిన ఆ పని చూసి కోపంతో కసిరాడు.

"పాపం ఆ పావురం దాల్లో చిక్కుకుని చనిపోయేలా ఉంది డాడీ" అంది రూప.

"అదే ఎలాగోలా విడిపించుకుంటుంది. లేదా చస్తుంది. రోడ్‌మీద ఎందరో వెళ్తున్నారు. వాళ్ళెవరికీ పట్టనిది నీకెందుకు?"

తండ్రి కోపాన్నీ, ఆ చెంపదెబ్బనీ కూడా పట్టించుకోకుండా కొమ్మమీద వాలి ఆమెవైపే చూస్తున్న ఆ పావురాన్నే చూస్తోంది రూప తృప్తిగా!

❋ ❋ ❋

ఆ జ్ఞాపకం స్మృతిపథంలో మెదిలి, మిగతా వారిలా తానూ కరతాళ ధ్వనులతో తండ్రిని అభినందించలేకపోతోంది రూప చంద్రిక.

రూపకు చాలా చిన్నప్పటినుండీ మూగజీవాలంటే ప్రేమ. ఇంట్లో, ఓ కుక్కపిల్లని పెంచుకోవాలనీ, దాన్ని అపురూపంగా చూసుకుంటూ దాన్తో స్నేహించాలనీ ఓ కోరిక. చాలా బలీయమైన కోరిక. కానీ దశరథ్‌కి అది నచ్చదు. వొప్పుకునేవాడు కాదు. ముద్దొచ్చీ ఓ కుక్కపిల్లని పెంచుకుంటూ దాన్తో ఆడుకోవాలన్నది ఓ తీరని కోరికలా మిగిలిపోతూనే ఉంది ఆ అమ్మాయిలో!!

❋ ❋ ❋

సన్మాన కార్యక్రమం ముగిసి ఊరికి వచ్చేప్పుడు ట్రైన్‌లో అడిగాడు దశరథ్ భార్యని "నీ కూతురికి నా 'పంజరం' నచ్చలేదా?" అని. "దాన్నే అడగండి"అంది జమున రూప వైపు చూస్తూ. "ఏం రూపా? నీకు నచ్చలేదా నా ఫిల్మ్?" అడిగాడు కూతుర్ని. "నచ్చింది డాడీ" చెప్పింది రూప. "మరెందుకు? అంతా చప్పట్లు కొడ్తున్నా నువ్వు మాత్రం స్టిఫ్‌గా అలాగే కూర్చున్నావ్?"

ఆ అమ్మాయికి తండ్రికేం జవాబు చెప్పాలో తెలీలేదు. కాస్తాగి అప్పుడు చెప్పింది. 'మీకు నిజంగా జంతువులంటే ఇష్టం ఉండదు కదా. అయినా జీవకారుణ్యం గురించి చెప్పారు. మీరు ఆచరించనిది ఇతరులకు చెప్పడం నాకెందుకో నచ్చలేదు..." అతను హతాశుడై వింటున్నాడు. "... కేవలం బహుమతికోసం, ఒక 'గుర్తింపు'కోసం తప్ప, చెప్పే ఆ మంచిని మనం ఆచరించనప్పుడు, అదెంత సృజనాత్మకమైనదైనా, 'హిపోక్రసీ' అవుతుందనిపించింది డాడీ. అందమైన ఆత్మద్రోహం!!"

❋ ❋ ❋

తండ్రిలా కీర్తికోసమో రివార్డులకోసమోకాక నోరు లేని ప్రాణులకోసం నిజంగా ఏదైనా చేయాలన్న ఓ ఆలోచన రూప చంద్రికలో మొదలైంది. ఆ ఆలోచన స్పష్టత సంతరించుకోడానికి ఎక్కువ సమయం పట్టలేదు.

❋ ❋ ❋

ఓ ఆదివారం, అపర్ణ దగ్గరున్న వీడియో కెమెరా అడిగి తీసుకుంది రూప చంద్రిక. కెమేరా సెట్ చేసుకుని, బాల భానుడి బంగారు కిరణాల నడుమ నీటి కొలనులో ఈదులాడే బాతుల్నీ, అలలపై అలవోకగా వాలి మీనాలను ఒడిసిపట్టే తెల్లటి కొంగల్నీ పువ్వులపై వాలిన రంగురంగుల సీతాకోక చిలుకల్నీ, తల్లి తెచ్చే మేత కోసం ఆవురావురంటూ ఎదురుచూసే, పచ్చని కొమ్మల్లోని పేరుతెలీని పక్షుల్నీ, మైదానాల్లో హాయిగా విహరిస్తూ పచ్చిక మేసే గోవుల్నీ చిత్రీకరించసాగింది. ఒక్కో అందమైన మూగజీవం కెమేరాలో నిక్షిప్తమవ్వసాగింది. ఆ తర్వాత రూప ఆ ఊరి రోడ్లమీద తిరిగే ఆవుల్నీ, గేదెల్నీ చిత్రీకరిస్తూంటే ఒకచోట ఓ గేదె చెత్తకుప్పలో పడి ఉన్న ప్లాస్టిక్ సంచుల్ని తింటోంది. ఆ ప్లాస్టిక్ సంచుల్నే ఆహారమనుకుంటోంది పాపం.

మరోచోట మరో ఆవు. అది చాలా నీరసంగా అనారోగ్యంగా కనిపిస్తోంది. కదలలేక కదులుతోంది. రూప ఆ ఆవుదగ్గరకు వెళ్ళింది కెమేరాతో. ఆ ఆవు శరీరం చాలా అసాధారణ స్థాయిలో ఉబ్బిపోయి ఉంది. కళ్ళల్లో దైన్యం. హృదయాన్ని కదిలించేంత దైన్యం. లెక్కలోంచి, దాన్నలా చూస్తుండగానే, దానికళ్ళు క్రమంగా మూతలు. ప.డ.సా.గా.యి! 'దాని కళ్ళు వణుకుతున్నాయి. అయ్యో దానికేదో అవుతోంది' అనుకుంది రూప. రెండు క్షణాల్లో, అది రోడ్‌మీదే కుప్పకూలిపోయింది. కళ్ళు మూతపడిపోయాయి. శాశ్వతంగా బాధతో, కెమేరా ఆఫ్ చేసేసింది రూప.

వెటరినరీ ఆసుపత్రికి ఫోన్ చేసింది రూప. కాసేపటికి, ఆ సిబ్బంది వచ్చి ఆవు మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. శవపరీక్ష నిర్వహించిన సర్జన్ ఆ ఆవు కడుపులోంచి దాదాపు నాలుగువేల ప్లాస్టిక్ బ్యాగుల్ని బయటకు తీస్తే, రూప ఆ ప్లాస్టిక్ వేస్ట్‌ని కెమేరాలో బంధించింది. "వీటివల్లే ఈ ఆవు చనిపోయిందా డాక్టర్?" అని అడిగిన రూప ప్రశ్నకు ఆ డాక్టర్ చెప్పే సమాధానాన్ని రికార్డ్ చేస్తోంది కెమేరా.

"...ఈ స్ట్రేక్యాటిల్‌లో తొంభైశాతం చావులకి ఈ ప్లాస్టిక్కే కారణం. చెత్తకుప్పల్లో మనం పారేసే ప్లాస్టిక్ సంచుల్నే ఆహారమనుకుని తినేసి ఇలా అయిపోతున్నాయవి. ఈ ప్లాస్టిక్ అన్నది చాలా ప్రమాదకరమైంది. ఇన్‌డైజెస్టిబుల్ మేటర్! జీర్ణం కాదు! దాంతో, కడుపులో ఇదంతా ఒక కుప్పలా పేరుకుపోతుంది. అరక్కపోవడంతో, ఆపై ఇంకేమీ తినలేకపోతాయి. దాంతో ఆకలి బాధ. కడుపులో ఖాళీ ఉండదు. ఆకలితో మాడిమాడి చచ్చిపోతాయి. ఈ ఆవు విషయంలో ఇంకా హృదయ విదారకమైనదొకటి జరిగింది. అది తిన్న ఓ ప్లాస్టిక్ సంచిలో సూదులూ, పగిలిన సీసాపెంకులూ ఉన్నాయి!! ఒక సీసా పెంకు దీని కడుపులోకి వెళ్ళిపోయింది. ఆ గాజుపెంకు సూదిమొన ఆవు కడుపు(రెటిక్యులమ్) పొరల్ని చీల్చుకుని క్రమంగా గుండెలోకి దిగిపోయింది! ట్రుమాటిక్ పెరికార్డైటిస్ అంటారు. అందుకే ఇది మరణించింది!"

ఒక మేకునీ, ఆ గాజుసీసా పెంకునీ బయటకు తీసి చూపించాడు డాక్టర్ కెమెరాటెక్స్ ముందు.

❊ ❊ ❊

మొదట అపర్ణకీ, అపర్ణ తల్లికీ తన చిత్రాన్ని చూపించింది రూప చంద్రిక. ఇద్దరూ ఊపిరి బిగపట్టి చూసారు దాన్ని.

ఆ తర్వాత, అపర్ణ తల్లి సాయంతో ఓ చిన్ని ఫంక్షన్ హాల్లో ఆ ఊర్లో చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే దుకాణాలు యజమానుల్ని, సమావేశ పరిచింది రూపచంద్రిక. దాదాపు పాతిక మందికి పైగా వ్యాపారులు అక్కడకు చేరుకున్నారు. అద్దెకు తీసుకున్న ప్రొజెక్టర్‌తో, పుల్ డౌన్ స్క్రీన్‌మీద తన చిత్రాల్ని ప్రదర్శించింది రూప. రూప తీసిన ఆ సినిమా పూర్తయ్యేసరికి ఇద్దరు ముగ్గురైతే దాదాపు ఏడ్చేశారు ఆ ఆవు చనిపోయిన తీరు చూసి. అప్పుడు రూప చెప్పింది. "వీధుల్లో తిరిగే ఎన్నో పశువులు ఇలా హృదయ విదారకంగా మరణిస్తున్నాయి. కొన్నిచోట్ల పక్షులు కూడా ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలు తిని, కడుపులో అవి అరగక ఆహార నాళానికి అవరోధమై ఆకలితో మాడి కొన్నిసార్లు క.డు.పు. చి.ట్లి.పో.యి చనిపోతున్నాయి. నోరు లేని జీవులిలా చనిపోకుండా మనమేంచేయాలో మానవత్వంతో ఆలోచించాలి. పర్యావరణాన్ని కాపాడుకోడం మనందరి విధి." హాల్లో లైట్లు వెలిగాయి. కొద్దిసేపు గాఢమైన నిశ్శబ్దం. ఆ తర్వాత అపర్ణ తల్లి లేచి నిల్చుని స్థిరంగా చెప్పింది. "మా సూపర్ మార్కెట్‌లో ఇకనుంచి ప్లాస్టిక్ బ్యాగులు వాడను రూపా!"

మర్నాడు జిల్లా ఎడిషన్లలో ఆ వార్త వచ్చింది. "జీవకారుణ్యంపై ఓ విద్యార్థిని లఘు చిత్రం"అన్న హెడ్డింగ్‌తో రాసారు అన్ని దినపత్రికల్లో.

❊ ❊ ❊

ఆఫీస్ లంచ్ బ్రేక్‌లో తన సహోద్యోగి ఒకరు ఆ వార్త చూపిస్తే అప్పుడు తెలిసింది దశరథ్‌కి. ఊపిరి బిగపట్టి పేపర్లలో రాసిందంతా చదివాడు. తన కూతురు రూప ఇదంతా చేసిందా? తనతో ఒక్కమాట కూడా చెప్పలేదు?!

ఆరోజు రవీంద్రభారతిలో తన సన్మానం సమయంలో రూప చప్పట్లు కొట్టకపోవడం గుర్తొచ్చింది!

"...ఒక గుర్తింపుకోసం తప్ప, చెప్పే మంచి పనిని మనం ఆచరించనప్పుడు అదెంత సృజనాత్మకమైనదైనా 'హిపోక్రసీ' అవుతుందనిపించింది డాడీ. అందమైన ఆత్మద్రోహం!" ఆరోజు తను అన్న ఆ మాటలు. అహం దెబ్బతిన్నట్టు అస్పష్టమైన ఇబ్బంది మనసు లోపల్లో ,పల.

ఆ ఆలోచనలతోనే సాయంత్రం ఆఫీస్‌నుండి ఇంటికొస్తూ స్కూటర్ వేగంగా నడుపుతున్నాడు దశరథ్ తనకే తెలీకుండా. ఇంతలో హఠాత్తుగా ఛాతీలో నొప్పిగా అనిపించింది. కొంత దూరం వచ్చేసరికి నొప్పి తీవ్రతరమైంది. స్కూటర్ మీది నుంచి తూలి పడిపోయాడన్నట్టుంది. అతన్నలా చూసి నలుగురైదుగురు ఆగారు. దశరథ్, ఛాతీ పట్టుకుని "నొప్పి, హాస్పిటల్‌కి తీసుకెళ్ళండి ప్లీజ్" బ్రతిమిలాడ్తూ చెప్పాడు. కానీ ఎవ్వరూ పట్టించుకోలేదు! క్రమంగా స్పృహ తప్పుతున్న సమయంలో, ఒక చేయి అతన్ని తాకి పైకి లేవనెత్తింది!

❊ ❊ ❊

సమయానికి రావడంతో దశరథ్ ప్రాణాల్ని కాపాడగలిగారు డాక్టర్లు గుండెపోటు నుండి. జమున, రూప చంద్రిక అతని బెడ్ పక్కనే నిల్చుని ఉన్నారు హాస్పిటల్లో. దశరథ్ హఠాత్తుగా కూతురి చేయి పట్టుకున్నాడు. ఆమె తండ్రి కళ్లల్లోకి చూసింది. ఆర్ద్రంగా కూతురి చేతిని తడుముతున్నాడతను. "సారీ రూపా..."అన్నాడు బాధగా. రూప ఆశ్చర్యంగా చూసింది. దశరథ్ కన్నుల్లో స్పష్టమైన తడి. "ఆరోజు నువ్ కాపాడిన ఆ పావురంలానే రోడ్‌మీద నిస్సహాయంగా పడి ఉన్నాను నేనూను. ఎవ్వరూ పట్టించుకోలేదు. ఆ పావురం నోరులేని మూగజీవి. నువ్వు దాని బాధనుకూడా అర్థంచేసుకోగలిగావ్..." అతని స్వరం దగ్గదమైంది.

"...ఒక 'ప్రాణి' బాధతో విలవిల్లాడుతుంటే, చూసీ చూడనట్టు వెళ్ళిపోవడం ఎంత అమానుషమో తెలిసింది రా రూపా." అతని కళ్ళల్లో అపరాధ భావన. "...నన్నిక్కెడకు తీసుకొచ్చిన ఆ రిక్షా అతనికి ఏమిచ్చినా ఋణం తీరదు. అతనికి మనసారా కృతజ్ఞతలు చెప్పాలి" అన్నాడు కూతురి చేయి వదలకుండానే.

❊ ❊ ❊

దశరథ్ పూర్తిగా కోలుకుని ఆసుపత్రినుండి ఇంటికొచ్చేశాడు.

ఓరోజు- రూప కాలేజ్‌నుండి ఇంటికొచ్చేసరికి, ఒక అట్టపెట్టె గిఫ్ట్ ర్యాప్ చేయబడి, టేబుల్‌మీద కనిపించింది. 'జి.రూపచంద్రిక, ఇంటర్ సెకండ్ ఇయర్' అని ఉంది. ఆశ్చర్యపోతూ, బాక్స్ తెరిచింది. అంతే. ఆ అమ్మాయి కళ్ళు వేలు చంద్రికలు ఒక్కసారిగా వెలిగినట్టు ప్రకాశవంతమైనాయి. ముద్దుగా బొద్దుగా అందంగా ఉన్న తెల్ల కుక్కపిల్ల, లైవ్‌స్టార్ ప్యాకింగ్ బాక్స్‌లోంచి "కుయ్ కుయ్"మంటూ బయటకు ఉరికింది! దాని మెడలో కట్టిన శాటిన్ రిబ్బన్‌కి ఉన్న టేబిల్ మీద ఈ అక్షరాలున్నాయి.

ఎ స్మాల్ గిఫ్ట్ టు మై వం.డ.ర్.ఫు.ల్ డాటర్

- నాన్న.

❊ ❊ ❊

ఆ తర్వాత కొన్నాళ్ళకి రెండు విషయాలు జరిగాయి.

ఒకటి:

జనపనారతో సంచుల్ని ఉత్పత్తిచేసే చిన్నతరహా పరిశ్రమలు మొదలై, ప్లాస్టిక్ వినియోగాన్ని స్వచ్ఛందంగా వదిలివేసిన ఒకే ఒక ప్రాంతంగా దేశంలోని ఇతర ఊళ్ళన్నిటికీ ఆదర్శంగా నిలిచిందా ఊరు, రూప తీసిన ఆ లఘు చిత్రం ప్రేరణ కారణంగా.

రెండు:

'అవయవదానం' అనే అంశంమీద మరో చిరు చిత్రం తీసాడు దశరథ్. "పంజరం"లోనే దానికీ ఎన్నో బహుమతులు వచ్చాయి.

ఎంతమంది ఎంతగా ప్రశంసించినా, రూపచంద్రిక "చాలా బావుంది డాడీ"అంటూ తనకిచ్చిన కరచాలనాన్ని మించిన తృప్తినివ్వవలేదతనికి!

కూతురి తల ప్రేమగా నిమురుతూ అతడు చెప్పాడు. "అవయవదానం గొప్పతనాన్ని ఇతరులకు చెప్పేందుకు దీన్ని తీసాను..." క్షణం ఆగి,,..."ఇతరులకు చెప్పడం కాదు. మరణానంతరం నా అవయవాల్ని దానం చేసేందుకు వీలుగా సంబంధిత పత్రాల పైన సంతకం చేసాకే ఈ చిత్రాన్ని తీసానురా రూపా!..."

"...ఈసారి ఆత్మద్రోహానికి పాల్పడలేదమ్మా! నిజం??" అతను నిజాయితీగా చెప్పాడు.

ఒక నీతి, ఒక మంచీ ఇతరులకు చెప్పేముందు మనమూ స్వయంగా ఆచరించి ఆదర్శంగా నిలవాలన్న స్పృహ తండ్రిలో కలగటంకంటే కావలసింది ఏముందనుకుంది. ఆలోచిస్తోంది రూప చంద్రిక.

★


రచయిత చిరునామా:

**గుమ్మడి రవీంద్రనాథ్,**

మేనేజర్

యునైటెడ్ ఇండియా ఆఫీసర్స్ క్వార్టర్స్,

ఫ్లాట్ నెం.203, ఆపోజిట్ సెంట్రల్ బ్లడ్ బ్యాంక్,

నారాయణగూడ, హైదరాబాద్- 29.